## క్లుప్తంగా

### ప్రతి పంచాయతీలో మోడల్ స్కూలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ బాబ్జీ

పాకాల : ప్రతి పంచాయతీలో ఒక మోడల్ స్కూల్ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టినట్లు ఎంఈఓ బాబ్జీ తెలిపారు. సోమవారం ఎమ్మార్సీ కేంద్రంలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ ప్రాథమిక విద్యను బలోపేతం చేయడమే లక్ష్యంగా పంచాయతీల్లో ఆదర్శ ఎంపీపీ పాఠశాలలను ప్రభుత్వం ప్రారంభించనుందని వెల్లడించారు. మోడల్ పాఠశాలలో తరగతికి ఒక్కో ఉపాధ్యాయుడు చొప్పున 5 మందిని నియమించనున్నట్లు వివరించారు. ఈ మేరకు అదనపు తరగతి గదులతోపాటు అవసరమైన రవాణా సౌకర్యం కూడా కల్పిస్తుందని తెలిపారు. దీనిపై ప్రజలకు అవగాహన కలిగించి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను పెద్ద సంఖ్యలో చేర్పించేందుకు కృషి చేయాలని కోరారు. సమావేశంలో సీఆర్పీలు శ్రీనివాసులు, ప్రకాష్‌రెడ్డి, జ్యోతి, శివకుమారి పాల్గొన్నారు.

### శాంతి భద్రతల రక్షణే ధ్యేయం



కేంద్ర బలగాలతో కవాతు నిర్వహిస్తున్న సీఐ సుదర్శన్‌ప్రసాద్

పాకాల : మండలంలో శాంతి భద్రతల రక్షణ ధ్యేయంగా విధులు నిర్వర్తిస్తున్నట్లు సీఐ సుదర్శన్‌ప్రసాద్ తెలిపారు. సోమవారం ఈ మేరకు మండలంలోని సామిరెడ్డిపల్లె, పంటపల్లె, పాకాల, ఉప్పరపల్లె, మద్దినాయనపల్లె, పాలినేనివారిపల్లె, ఓసీ పల్లె, నాగాపురం గ్రామాల్లో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ ఎస్పీ హర్షవర్ధన్‌రాజు, డీఎస్పీ ప్రసాద్ ఆదేశాల మేరకు పల్లెల్లో కవాతు చేపట్టినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పుల్లన్న పాల్గొన్నారు.

### ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్లు



విద్యార్థికి అడ్మిషన్ అందజేస్తున్న అధ్యాపకులు

చంద్రగిరి : ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ఫస్టియర్‌కు అడ్మిషన్లు ప్రారంభించినట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్ తెలిపారు. సోమవారం ఈ మేరకు విద్యార్థులకు అడ్మిషన్‌తోపాటు ప్రభుత్వం సరఫరా చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, ప్రాక్టికల్ మెటీరియల్ అందించారు. ముఖ్య అతిథులుగా హాజరైన రాష్ట్ర అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు రవి, బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు అందిస్తున్నట్లు వెల్లడించారు.

### ఘనంగా స్నాతకోత్సవం



పట్టాలు అందుకున్న చిన్నారులు

తిరుపతి కల్చరల్ : యశోదనగర్‌లోని లిటిల్ ఏంజల్స్ స్కూల్‌లో సోమవారం ఘనంగా స్నాతకోత్సవం నిర్వహించారు. పూర్వవిద్యార్థులు జూనియర్ లెక్చరర్ సాయి మాధురి, రుయా ఆస్పత్రి సీఆర్ఓ డాక్టర్ పద్మశ్రీ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిన్నారులకు స్నాతకోత్సవ పట్టాలను అందజేశారు. పాఠశాల అధినేత కె.రాజగోపాల్‌రెడ్డి, చైర్ పర్సన్ ఎం.రమాదేవి, డైరెక్టర్ డాక్టర్ శ్వేత విద్యార్థులను అభినందించారు. ప్రిన్సిపల్ పద్మశ్రీ పాల్గొన్నారు.

### నగరవాసులకు చల్లటి నీరు



చలివేంద్రం ప్రారంభిస్తున్న కమిషనర్ మౌర్య

తిరుపతి తుడా : వేసవి నేపథ్యంలో నగర ప్రజలు, యాత్రికుల దాహార్తిని తీర్చేందుకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. సోమవారం ఈ మేరకు రామానుజ కూడలి వద్ద చలివేంద్రాన్ని కమిషనర్ మౌర్య ప్రారంభించారు. మొత్తం 12 ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు.

### చంద్రగిరిలో..



మజ్జిగ పంపిణీ చేస్తున్న సర్పంచ్, ఇన్‌చార్జి ఎంపీడీఓ

చంద్రగిరి : వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు సర్పంచ్ ముదికుప్పం రూపారామ్మూర్తి సోమవారం చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వెంకటరత్నం చేతులమీదుగా తొలిరోజు మజ్జిగ పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ టవర్‌క్లాక్ వద్ద చలివేంద్రంలో నిత్యం తాగునీరు అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సిబ్బంది ఆదెమ్మ, నాగార్జున, శివ పాల్గొన్నారు.

## కల్యాణం.. కమనీయం



పెళ్లిమండపంలో సీతారాముల కల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకోదండరామస్వామి వారి ఆలయంలో సోమవారం రాత్రి శ్రీసీతారాముల కల్యాణోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. ఈ క్రమంలో టీటీడీ అధికారులు అంబారీపై ముత్యాల తలంబ్రాలను అంబారీపై తీసుకువచ్చి సమర్పించారు. ఆగమ పండితులు సీతారామాచార్యుల ఆధ్వర్యంలో కల్యాణ ఘట్టం జరిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవర్లను వైభవంగా ఊరేగించారు. సీతారాములను పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ డిప్యూటీ ఈఓ నాగరత్న, ఏఈఓ రవి, సూపరింటెండెంట్ మునిశంకర్ పాల్గొన్నారు.


– తిరుపతి కల్చరల్



ముత్యాల తలంబ్రాల ఊరేగింపు

# ఇష్టారాజ్యంగా బుగ్గ షికారు!

- ఇబ్బడిముబ్బడిగా రెడ్..బ్లూ లైట్ వాహనాలు
- సైరన్ వేసుకుని హల్‌చల్
- యథేచ్ఛగా నిబంధనలను అతిక్రమణ
- పట్టించుకోని ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు





ఆధునిక సమాజంలో కార్ల వినియోగం పెరిగిపోయింది. కనీస అవసరాల్లో ఒకటిగా మారుతోంది. ఈ క్రమంలో టాప్‌పై ఎరుపు.. నీలిరంగు లైట్లు అమర్చిన కారంటే ప్రత్యేక హోదా భావిస్తున్నారు. కేవలం వీఐపీలు.. వీవీఐపీలు మాత్రమే వాడాల్సిన బుగ్గ కార్లను కొందరు నిబంధనలకు విరుద్ధంగా వాడేస్తున్నారు. దీంతో ఏ వాహనంలో ఎవరు ప్రయాణిస్తున్నారో తెలియని పరిస్థితి తలెత్తుతోంది. ఈ మేరకు బుగ్గ కార్ల వినియోగానికి ఎవరు అర్హులనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరముంది.

తిరుపతి మంగళం : అద్దాలపై పరిమితికి మించిన రంగుతో కూడిన ఫిల్మ్ వేసుకుని సంచరిస్తున్న వాహనాలే కాదు. టాప్‌పై ఎరుపు, నీలిరంగు లైట్లు (బుగ్గలు, సైరన్లు) పెట్టుకుని సంచరిస్తున్న వాహనాలకు కొదవే లేదు. వీటి వినియోగం కేవలం నిబంధనల ఉల్లంఘన మాత్రమే కాదు. భద్రతా పరంగానూ పెను సవాలే. అయినప్పటికీ ట్రాఫిక్, రవాణాశాఖ అధికారులు మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు.

**దూసుకెళ్లే అవకాశం**

సాధారణంగా ఈ తరహా లైట్లు, సైరన్‌తో వచ్చే వాహనాలను చూసి సామాన్యులే కాదు పోలీసులు కూడా అప్రమత్తం అవుతారు. సాధారణ వాహనచోదకులు దారి ఇవ్వడానికి ప్రయత్నిస్తే, వాటిని ఆపడానికి విధుల్లో ఉన్న పోలీసులు సైతం ప్రయత్నించరు. ఆయా వాహనాల్లో ప్రముఖులు ఉంటారనే భావనే దీనికి ప్రధాన కారణం. ఇదే అదునుగా తీసుకునే కొందరు అనర్హులు ఈ తరహా లైట్లను కారు టాప్‌పై పెట్టుకుని, సైరన్లు వేసుకుంటూ దూసుకెళుతుంటారు. 2001లో ఢిల్లీలోని పార్లమెంట్‌పై దాడి చేసిన ఉగ్రవాదులు కూడా ఇలాంటి లైట్లు, సైరన్స్ ఉన్న వాహనాలనే వినియోగించారు. ఈ తరహా లైట్లు, సైరన్లు ఉన్న కారణంగా భద్రతా సిబ్బంది ఆ వాహనాలను పార్లమెంట్ ఆవరణలోకి రాకుండా అడ్డుకోలేదు.

**ఎవరు వినియోగించాలంటే..**

రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, ప్రధాని, మాజీ రాష్ట్రపతులు, ఉప ప్రధాని, చీఫ్ జస్టిస్ ఆఫ్ ఇండియా, లోకసభ స్పీకర్, కేంద్ర కేబినెట్ మంత్రులు, ప్లానింగ్ కమిషన్ ఉపాధ్యక్షుడు, మాజీ ప్రధానులు, ఉభయసభల ప్రతిపక్ష నేతలు, సుప్రీంకోర్టు న్యాయమూర్తులు దేశ వ్యాప్తంగా ఎక్కడైనా ఈ లైట్లు, సైరన్‌తో ప్రయాణించవచ్చు.

**90శాతం అనర్హులే...**

ఈ తరహా లైట్లు, సైరన్లు వినియోగిస్తున్న వారిలో 90శాతం అనర్హులే ఉంటున్నారు. సెంట్రల్ మోటారు వెహికల్ రూల్స్1989 ప్రకారం కేవలం 43 మంది వీవీఐపీలు మాత్రమే వీటిని వినియోగించాలి. అయితే అసెంబ్లీ సెక్రటేరియేట్‌తో పాటు కొన్ని శాఖలకు చెందిన ఉన్నతాధికారులు తమ వాహనాలపై ఎరుపు, నీలం లైట్లు ఏర్పాటు చేసుకుంటారు. పలువురు వీఐపీలు సైతం ఈ లైట్లు, సైరన్లను అక్రమంగా వినియోగిస్తున్నారు. స్పెషల్ సెక్రటరీ హోదాలో ఉన్న అధికారులకు కూడా తమ కార్లపై ఈ తరహా లైట్లు పెట్టుకునే అవకాశం లేదు. అయినప్పటికీ వివిధ హోదాలకు చెందిన వాళ్లు వీటిని వినియోగిస్తున్నారు. ఈ లైట్లు, సైరన్ కారుకు కలిగి ఉండటం హోదాగా బావించే వాళ్లు అనేక మంది ఉండడం గమనార్హం.

**ఫ్లాషర్ లేని రెడ్‌లైట్ :** చీఫ్ ఎలక్షన్ కమిషనర్, కాగ్ ఉపాధ్యక్షులు, కేంద్ర సహాయ మంత్రులు, ప్లానింగ్ కమిషన్ సభ్యులు, అటార్నీ జనరల్, కేబినెట్ సెక్రటరీ, త్రివిధ దళాల అధిపతులు, కేంద్ర డిప్యూటీ మంత్రులు, క్యాట్ చైర్మన్, మైనారిటీ కమిషన్ చైర్మన్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, యూపీఎస్సీ చైర్మన్ దేశవ్యాప్తంగా ఫ్లాషర్ లేని రెడ్ లైట్ ఉన్న కారులో తిరగవచ్చు.

**రెడ్‌లైట్ :** రాష్ట్ర గవర్నర్, గవర్నర్ ఎస్కార్ట్ వాహనాలు, సీఎస్, డీజీపీ, హైకోర్టు జడ్జిలు, లోకాయుక్త, అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ చైర్మన్, క్యాట్ వైస్ చైర్మన్లు కార్లపై రెడ్‌లైట్‌ను వినియోగించవచ్చు

**బ్లూ లైట్ :** ముఖ్యమంత్రి, మంత్రులు, అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, కౌన్సిల్ చైర్మన్, ఉపాధ్యక్షుడు బ్లూ లైట్ కార్లు వినియోగించాలి. అయితే వాహనంలో సదరు ప్రముఖులు ఉన్నప్పుడు మాత్రమే లైట్ వినియోగించాలని, లేకుంటే దానిపై బ్లాక్ కవర్‌ను తప్పనిసరిగా వేయాలి.

### యూఎస్ సదస్సుకు మహిళా వర్సిటీ విద్యార్థిని



విద్యార్థిని భార్గవికి ఆహ్వాన పత్రం అందిస్తున్న వీసీ

తిరుపతి సిటీ: యునైటెడ్ స్టేట్స్ ఆఫ్ అమెరికా రెనోలోని నెవాడా విశ్వవిద్యాలయం వేదికగా జూన్ 16 నుంచి జూలై 24వ తేదీ వరకు నిర్వహించనున్న «రూల్ ఆఫ్ లా అండ్ పబ్లిక్ సర్వీస్‌పై స్టూడెంట్ లీడర్స్ ప్రోగ్రామ్»కు మహిళా వర్సిటీ లా విభాగం విద్యార్థిని నూకతోటి భార్గవి ఎంపికైంది. ఈ మేరకు ఆమెకు వీసీ ప్రొఫెసర్ ఉమ సోమవారం ఆహ్వాన పత్రం అందజేశారు. ఇందులో తొమ్మిది దేశాల నుంచి విద్యార్థులు పాల్గొననున్నారు. ఈ సదస్సులో నాయకత్వ నైపుణ్యాల అభివృద్ధి, ప్రజాసేవే లక్ష్యంగా పలు అంశాలపై ప్రత్యేక అవగాహన కల్పించనున్నారు. అలాగే యూఎస్ చట్టాలు, పాలన, ప్రజాసేవపై సమతుల్య దృక్పథాన్ని అందించనున్నారు. విద్యార్థినిని వీసీ ఉమ, రిజిస్ట్రార్ రజని, డీన్ విజయలక్ష్మి, ప్రొఫెసర్ ఆర్ ఉమ, అధ్యాపకులు అభినందించారు.

### నలుగురు రౌడీ షీటర్ల బైండోవర్

తిరుపతి క్రైమ్: నగరంలో శాంతి భద్రతలో భాగంగా నాలుగు రౌడీషీటర్లను బైండ్ ఓవర్ చేసినట్లు ఈస్ట్ సీఐ రామకృష్ణ తెలిపారు. నగరంలో రాత్రి సమయంలో గొడవలు చోటు చేసుకున్నటువంటి నైపథ్యంలో రౌడీ షీటర్ పై పూర్తిస్థాయిలో నిగా పెట్టమన్నారు. అందులో భాగంగా నలిగింది బైండోవర్ చేసుకుని ఎమ్మార్వో ముందు హాజరు పరిచయం అన్నారు. మునుముందు సత్ప్రవర్తన లేకపోతే కఠినమైన చర్యలు తప్పవని హెచ్చరించారు

### బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు

తిరుపతి క్రైమ్: నగరంలో బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తిరుపతి ఎక్సైజ్ అర్బన్ సీఐ రామచంద్ర హెచ్చరించారు. ఆయన ఆధ్వర్యంలో ఆదివారం అర్ధరాత్రి నుంచి మద్యం షాపుల వద్ద బహిరంగంగా మద్యం చేవించే వారిని గుర్తించి ఇప్పటికే నలుగురిపై కేసు నమోదు చేశారు. నిరంతరం తనిఖీలు చేస్తుంటామని ఆయన హెచ్చరించారు.

## అలరించిన సాంస్కృతికోత్సవం



కళాకారులను సత్కరిస్తున్న కళానిధి చైర్మన్ జయరామ్

తిరుపతి కల్చరల్ : మంజుల కళానిధి ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో సోమవారం రాత్రి ప్రదర్శించిన సాంస్కృతికోత్సవం అలరించింది. నృత్య, నాటక, ఏకపాత్రాభినయ వంటి నవరస భరిత కళాభినయాలు ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో కళాకారులు వీఎస్ భరద్వాజ్, శాంబోలు హరినాథ్, డాక్టర్ ఆమూరి సుబ్రమణ్యం, మహేశ్వర్, కనకమహాలక్ష్మి, సుజనాయాదవ్, చంద్రబాబు, కన్నెప్పగిరి కేశవులురెడ్డిని నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. మంజుల కళానిధి చైర్మన్ బి.జయరామ్, కోశాధికారి బి.శాంతి, సింగం శెట్టి సుబ్బరామయ్య, రుద్రకోటి సదాశివం, వి.జగన్నాథం పాల్గొన్నారు.

## ఇంటి నిర్మాణానికి ఆర్థిక సాయం



లబ్ధిదారులకు చెక్కు అందిస్తున్న కలెక్టర్

తిరుపతి అర్బన్ : తిరుచానూరుకు చెందిన కె.లీలావతి, శరవణ్ దంపతుల ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం తరపున కలెక్టర్ వెంకటేశ్వర్ ఆర్థిక సాయం అందించారు. ఇటీవల తిరుపతికి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబును శరవణ్ దంపతులు కలిసి ఇల్లు నిర్మించుకునేందుకు చేయూతనందించాలని విన్నవించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కలెక్టర్ సోమవారం రూ.లక్ష చెక్కును పంపిణీ చేశారు.

ర్యాలీలో డీఎంహెచ్ఓ బాలకృష్ణనాయక్ తదితరులు



## ఆరోగ్యమే మహాభాగ్యం

తిరుపతి, చంద్రగిరిలో సోమవారం ప్రపంచ ఆరోగ్య దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, వైద్య సిబ్బంది ర్యాలీ చేపట్టారు. ఆరోగ్య సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పించారు. రుయా ఆస్పత్రి పరిసరాల్లోని అభాగ్యులకు నవసమాజ్ ఆధ్వర్యంలో బ్రెడ్.. పండ్లు పంపిణీ చేశారు. డీఎంహెచ్ఓ బాలకృష్ణ నాయక్, వైద్యులు ఆర్ ఆర్ రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, పద్మావతి, లావణ్య, కిరణ్‌కుమార్, చంద్రగిరి వైద్యాధికారి యుగంధర్, మధుసూదన్ రావు, రేవతి, ప్రణీత, డాక్టర్ ఏబీ జగదీష్ పాల్గొన్నారు.

– తిరుపతి తుడా/ చంద్రగిరి



రుయాలో మాట్లాడుతున్న వైద్యాధికారులు



చంద్రగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది




ర్యాలీ నిర్వహిస్తున్న రుయా వైద్యులు, సిబ్బంది

# గమనం లేక గందరగోళం!

- కార్పొరేషన్ కార్యాలయంలో టీడీపీ నేతల హంగామా
- ఎమ్మెల్యే వర్గీయుల ఆధిపత్యానికి చెక్ పెట్టడమే లక్ష్యం

తిరుపతి తుడా : నగరంలో టీడీపీ నేతలకు దిశ దశ లేకుండా పోయింది. జనసేన ఎమ్మెల్యే, ఆయన వర్గీయులే పెత్తనం చెలాయిస్తుండడంతో దిక్కుతోచని పరిస్థితి ఎదురవుతోంది. ఎమ్మెల్యేను కాదని తమ వద్దకు ఎవరూ రాకపోవడంతో రాజకీయ గమనం ప్రశ్నార్థకంగా మారిపోయింది. ఈ క్రమంలో ఉనికి కాపాడుకునేందుకు టీడీపీ నేతలు తీవ్రంగా యత్నిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో గందరగోళం సృష్టించారు.

**అధికారులపై దండయాత్ర**

తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం అధికారులపైకి టీడీపీ నేతలు ఒక్కసారిగా దండెత్తారు. 'అసలు ఏం జరుగుతోంది .. టీడీఆర్ బాండ్లు సకాలంలో ఇవ్వకుండా ఎందుకు తాత్సారం చేస్తున్నారు..' అంటూ హడావుడి చేశారు. అధికారులను భయభ్రాంతులకు గురి చేశారు. శాప్ చైర్మన్ రవి నాయుడు, డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, మాజీ ఎమ్మెల్యే సుగుణమ్మ, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, నేతలు శ్రీధర్ వర్మ, మహేష్ యాదవ్, చిన్నబాబు, బుల్లెట్ రమణ, వివేక్ తదితరులు పదుల సంఖ్యలో కార్యాలయంలోకి చొచ్చుకొచ్చారు. ఇదే అదునుగా కమిషనర్ చాంబర్‌తోపాటు టీడీఆర్ బాండ్ల స్పెషల్ డ్రైవ్‌లోనూ కొందరు చోటా నేతలు హల్ చల్ చేశారు. ఇదివరకు తమ మాట వినని అధికారులపై దురుసుగా వ్యవహరించారు. గ్రీవెన్స్‌లో తమ సమస్యలను విన్నవించేందుకు వచ్చిన ప్రజలకు సైతం అడ్డుపడ్డారు.



గ్రీవెన్స్‌లో కమిషనర్ విధులకు ఆటంకం కలిగిస్తున్న టీడీపీ నేతలు

**రసాభాసగా స్పెషల్ డ్రైవ్**

టీడీపీ నేతలు, కార్యకర్తల కారణంగా టీడీఆర్ బాండ్ల కోసం ఏర్పాటు చేసిన స్పెషల్ డ్రైవ్ రసాభాసగా మారింది. డాక్యుమెంట్లను అందించేందుకు వచ్చిన బాధితులకు అడ్డుగా సుమారు 50 మంది టీడీపీ నేతలు తిష్ట వేశారు. పచ్చ మూక కదలకపోవడంతో అధికారులే అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో బాధితులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**ఉనికి కోసమేనా..**



టీడీఆర్ స్పెషల్ డ్రైవ్‌లో హల్‌చల్ చేస్తూ..

నగరంలోని కార్యాలయాల్లో అన్ని వ్యవహారాలను జనసేన నేతలే చూసుకుంటున్నారు. టీడీపీకి నగర ఇన్‌చార్జి లేకపోవడంతో కార్యకర్తలు ఎక్కడికి వెళ్లాలో తెలియక సతమతమవుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి తీవ్రమైన నిరాశలోనే ఉండిపోయారు. ఈ క్రమంలో పార్టీ కార్యకర్తలకు భరోసా కల్పించేందుకే టీడీపీ నేతలు మూకుమ్మడిగా హంగామా చేసినట్లు తెలిసింది. ఈ మేరకు మంత్రి లోకేష్ సైతం సూచించినట్లు సమాచారం. అయితే టీడీపీ నేతల వ్యవహారంపై జనసేన శ్రేణులు గుర్రుమంటున్నట్లు తెలుస్తోంది. ఎమ్మెల్యేను కాదని అధికారుల వద్దకు వెళ్లడంపై మండిపడుతున్నట్లు ఆ పార్టీ నేతలు బహిరంగంగానే వ్యాఖ్యానిస్తుండడం గమనార్హం.

### గ్రీవెన్స్‌కు 34 వినతులు

తిరుపతి తుడా : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కమిషనర్, గ్రీవెన్స్‌కు 34 వినతులు వచ్చినట్లు కమిషనర్ మౌర్య తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎంఈలు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ పాల్గొన్నారు

### మళ్లీ వేతన వెతలు!



తిరుపతి సిటీ : ఎస్వీయూ ఉద్యోగులకు మళ్లీ వేతన వెతలు తప్పలేదు. ఈ నెల 8వ తేదీ వచ్చినా జీతాల ఊసేలేదు. గత 9 నెలలుగా ఇదే పరిస్థితి. ఎస్వీయూ చరిత్రలో ఇంత దారుణంగా ఎప్పుడూ లేదని ఉద్యోగులు మండిపడుతున్నారు. ప్రభుత్వం, వర్సిటీ అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈనెల 15తేదీ వరకు జీతాలు అందించలేమని అధికారుల నుంచి చేతులెత్తేశారని వాపోతున్నారు.

### ఒకరికి ఏడాది జైలు

తిరుపతి లీగల్: ప్రభుత్వ ఉద్యోగి విధులను అడ్డుకున్న కేసులో చంద్రగిరి మండలం, కొట్టాల గ్రామానికి చెందిన డి.బాలాజీకి ఏడాది జైలు శిక్ష విధిస్తూ తిరుపతి ఆరో ప్రత్యేక జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున ప్రేమ్ సాగర్ వాదించారు

### న్యాయవాది లక్ష్మన్న మృతి



లక్ష్మన్న (ఫైల్)

తిరుపతి లీగల్ : తిరుపతి న్యాయవాదుల సంఘం మాజీ అధ్యక్షుడు,సీనియర్ న్యాయవాది ఊటుపల్లి లక్ష్మన్న సోమవారం గుండెపోటుతో మృతి చెందారు. న్యాయవాదుల అసోసియేషన్ హాల్లో మాట్లాడుతూ అస్వస్థతకు గురయ్యారు. వెంటనే 108కు ఫోన్ చేయగా, సిబ్బంది వచ్చి పరీక్షించి ఆయన మరణించినట్లు వెల్లడించారు. లక్ష్మన్న మృతికి పలువురు న్యాయవాదులు సంతాపం తెలిపారు.

### 11 మందికి జరిమానా

తిరుపతి లీగల్: మద్యం తాగి తిరుపతిలో వాహనాలు నడుపుతున్న 11 మందికి ఒక్కొక్కరికీ పదివేల రూపాయల చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్ జడ్జి గ్రంధి శ్రీనివాస్ సోమవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ పోలీసులు నగరంలో తనిఖీలు నిర్వహించి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచినట్లు కోర్టు కానిస్టేబుల్ గిరిబాబు తెలిపారు.

### విద్యార్థుల ప్రతిభ గర్వకారణం



మాట్లాడుతున్న వీసీ, అధ్యాపకులు

తిరుపతి సిటీ : జాతీయ సంస్కృత వర్సిటీ విద్యార్థులు జాతీయ స్థాయిలో పలు పోటీలలో ప్రతిభను కనబరచి బంగారు పతకాలు, ప్రశంసాపత్రాలను గెలుచుకోవడం వర్సిటీకి గర్వకారణమని వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి కొనియాడారు. సోమవారం వర్సిటీలో వివిధ పరిషత్తులు సమాపన సమారోహం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. డాక్టర్ హెచ్ నాగరాజు, డాక్టర్ ఉదయన హెగ్డే పాల్గొన్నారు.

### కమ్యునికేషన్ స్కిల్స్‌పై సదస్సు



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న అధ్యాపకులు

తిరుపతి సిటీ : స్థానిక బైరాగిపట్టెడలోని కొండారెడ్డి రాయలసీమ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ అండ్ టెక్నాలజీలో ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్ మొదటి ఏడాది విద్యార్థులకు ఎఫెక్టివ్ కమ్యునికేషన్ స్కిల్స్‌పై సదస్సును సోమవారం ప్రారంభించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కమ్యూనికేషన్ స్కిల్స్‌పై పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల నిర్వాహకులు వై.కొండారెడ్డి, ఆనందరెడ్డి, విజయారెడ్డి, హెచ్ఓడీలు నిరంజన్ రెడ్డి, పి.మధుర పాల్గొన్నారు